# తుఫానెప్పుడొస్తుంది ?

మనిషి సంకుచితత్వాన్ని అపహాస్యం చేస్తున్నట్లుగా — ఎవరికి వారు వేర్పాటుగా కట్టుకున్న ఇళ్ళనూ-ఏర్పరచుకున్న పొలంగట్లనూ-నేలమట్టం చేసిపోయింది ఉప్పెన...

నీదీ నాదీ అనిచెప్పి గుర్తులేవీ మిగల్చకుండా కసితీర్చుకుంది.

రెండురోజుల క్రితం అవన్నీ పంటపొలాలు....ఇప్పుడక్కడంతా ఇసుకపర్ర !....

ఆ యిసుకపర్రలో-తన పొలం ఎక్కడుందో అంతుబట్టటంలేదు సోములుకి !.... మండుటెండలో వంచిన నడుం ఎత్తకుండా తవ్వుతున్నాడు. అక్కడా, ఇక్కడా అనికాకుండా ఎక్కడపడితే అక్కడ పిచ్చివాడిలా తవ్వుతున్నాడు. తవ్విన చోటల్లా గుచ్చిగుచ్చి చూస్తున్నాడు.

అయినవాళ్ళందరు నీటిపాలవగా, తానొక్కడూ మిగిలేడు.... ఇప్పుడు తనకు పొలంమీద భ్రాంతిలేదు. మనసులో కొంచెమైనా శాంతి లేదు. ఉన్నదల్లా, తన తల్లీ తండ్రీ ఎక్కడైనా కాలికి తగుల్తారేమోననే చివురంత భ్రమ.

చాలామందితోపాటు-తన తల్లీ తండ్రీకూడా నేలగర్భంలో కలసిపోయేరు....

అయినా వాళ్ళకోసమే తవ్వుతున్నాడు. ఏ మూలనో తన తల్లి ముక్కుపుడకా, తన తండ్రి మొలత్రాడుకి వ్రేలాడే జార్జిబొమ్మ రూపాయికాసూ కనిపిస్తాయనే పిసరంత ఆశ !

కనీసం అవైనా కనిపిస్తే, వాటి ఆధారంతో ఆ ఎముక ముక్కల నైనా సమాధిచేసి కొడుకుగా, తన తల్లిదండ్రుల ఋణం తీర్చుకుంటాడు...

అసలు తాను చావకుండా మిగిలింది అందుకేనేమో !

ఆ ఊహే సోములుకి కొండంత ఓపికనిస్తోంది. ఆ వోపిక తోనే, ఆకలి దప్పులు మరచిపోయి మరీ తవ్వేడు.

నీరసంతో తూలిపడిపోయేదాకా తవ్వేడు...

స్పృహతప్పిన సోముల్ని జీవకారుణ్యం మనుషులు పక్కనే వున్న పట్నానికి తీసుకెళ్ళేరు.

వారం రోజులు ఆస్పత్రిలోనే వున్నాడు...

ఆ తర్వాత ఎచ్చుటెచ్చుటో తిరిగాడు.

తిరిగి తిరిగి మళ్ళీ తన చోటుకే చేరాడు.

'తనచోటు !?'

అలా అనుకోవటంలో ఏదో అనుభూతి...ఆ అనుభూతి అంచున-ముళ్ళపొదలా, గూడుకట్టుకున్న ఆ వేదన !...

ఆ చోటులో తనదంటూ తనకేదీ లేదు. అయినా మరెప్పటి అనుబంధమో అది...!

తన్నతల్లి లేదు... కళ్ళల్లోపెట్టుకుని పెంచిన తండ్రీ లేడు. అయినా అది తాను వున్నవూరు! మనసుకి మమకారపు సంకెళ్ళు బిగించి, మళ్ళీ తనను అచ్చటకు లాక్కొచ్చిన వూరు !

ఆ వూరు మేల్కొంటోంది! ఇప్పుడిప్పుడే కళ్ళుతెరుస్తున్న ఊళ్ళో, పోయిన వాళ్ళు పోగా మిగిలినవాళ్ళు ఒళ్ళు విరుచుకుని దిగుళ్ళు దిగ మింగుకుంటున్నారు. బతుకుమీద ఆశను పేర్చుకుంటున్నారు.

అచ్చట మిగిలినవాళ్ళకు అది పునర్జన్మ...!

సహాయ కార్యక్రమాలు అక్కడా విస్తరించుకుంటున్నాయి... చేలల్లో మేటేసిన ఇసుకపర్రను త్రవ్వి తరిమేసి, స్తన్యం కోసం తల్లి ఎదను తడిమే పసిపాపల్లా, అడుగున ఎక్కడో ఉడిగిపోయిన పంట పుట్టికోసం, కంటినిండా జ్యోతులు వెలిగించుకుని, ఆశగా, ఆబగా చూస్తున్నారు నేలతల్లి బిడ్డలు.

వాళ్ళ చెమటతో భూమాత తడుస్తోంది...తడిసి పులకిస్తోంది...

సోములు అందర్నీ చూస్తున్నాడు. అంతా గమనిస్తున్నాడు.

పదిరోజుల క్రితం...

రెడ్డిగారికి ఆ వూళ్ళో పదహారు గేదెలుండేవి. పదునైన పంట చేలుండేవి.

నాయుడిగారికి డాబుగా వెలిగిపోయే యిల్లుండేది... ఆ యింట్లో దీపం పెట్టే యిల్లాలుండేది.

పూజారి కృష్ణమాచార్యులుగారికి దేవుడు వేణుగోపాలస్వామి వుండేవాడు...ఆయన పేరున అయిదెకరాల మాగాణి వుండేది.

ఇంకా బట్టలుతికే వీరన్న, పాలుపోసే పైడమ్మ, కుండలు చేసే ధర్మన్న, అందరికీ పదిరోజుల క్రితం అంతో ఇంతో వుండేది. అంతస్తుల తారతమ్యాన్ని అడుగడుగునా గుర్తుచేసేది.

పదిరోజుల తర్వాత...

ఇప్పుడు అక్కడమిగిలిన వాళ్ళెవరికీ, ఏమీ మిగల్లేదు! ఇప్పుడు అందరిదీ ఒకే కుటుంబం... అందరూ కలసి ఊరుకట్టుకుంటున్నారు. అంతరాలు మరచిపోయి, పేరెట్టి పిలుచుకుంటున్నారు వింతగా; ఒకే పంక్తిన కూర్చుని కలో గంజో తాగుతున్నారు;

సమసమాజ స్థాపన ఇప్పుడు అచట మొదలవుతోంది.

ఆ మధ్యాహ్నం సూరీడు నడినెత్తిమీద కొచ్చినపుడు· నడుం లాగినట్టనిపించింది సోములుకి. తలకు చుట్టిన తుండు గుడ్డతీసి ముఖానికి పోసిన చెమట తుడుచుకున్నాడు. చేతిలోని పలుగును భూమిలో గుచ్చి - దానికే ఆనుకొని కూర్చున్నాడు. అచటకు కొంచెం దూరంగా జీవకారుణ్యం మనుషులు అందరికి భోజనం పంచుతున్నారు.

అచటకు వెళ్ళాలని అనిపించలేదు సోములుకి. నరాల్లో సిస్సత్తువ రక్తమే నిండిపోతోంది. గతంరేపిన చితిమంటలు తాలూకు ఎర్రదనం అతని కళ్ళల్లో పొంగిపోతోంది. కనుచూపు మేరలో నీడ నిచ్చే చెట్టు కనిపించటంలేదు.

కానీ...

వేడిఎండ వెల్తురులో దూరంగా కదలివస్తున్న నీడ;

ఆ నీడ జాడన ఎవరో ఆడమనిషి;

గుర్తుకురావటల్లా ఎవరో...

దగ్గరగా వచ్చింది... మాసిపోయి చిరిగిపోయిన తెల్లచీరలో, ముడతలుపడిపోయిన అవయవాల అవశేషాలను దాచుకుని, అడుగులో అడుగు వేసుకుంటా ఏదో ఆడగాలనే ఆత్రంతో ఆశగా వచ్చింది.

పిచ్చిపిచ్చిగావున్న తెల్లజుట్టులోకి వేళ్ళు గుచ్చుకుని బరబరా గోక్కుంటూ సోములువైపు చూసింది.

"బాబూ!" ఏదో అడగబోయి అరక్షణంపాటు ఆకాశంలోకి చూసింది...

ఆ తర్వాత...

"ఆకలి" అని అడగలేదు... "ధర్మం" చెయ్యమని చెయ్యి చాచలేదు...

దుఃఖంతోటి, వయసుతోటి పూడుకుపోయిన గొంతు పెగల్చుకుని అతికష్టంగా అడిగింది-

"మళ్ళీ తుఫానెప్పుడొస్తుంది బాబూ ?" అని.

ఆమెను, సోములు గుర్తుపట్టేడు.

ఊరిచివర మాలవాడలో వుండే పద్దాలు!

‡ ‡ ‡

పద్దాలు మొగుడు అప్పలకొండకి నాయుడుగారి దగ్గరే పని.... పనంటే ఎంత ప్రాణమో-పద్దాలంటే అంత ప్రేమ అప్పలకొండకి.

పెళ్ళయి ఏడేళ్ళయిపోయినా, వాళ్ళకి పిల్లలుపుట్టకపోవడంతో పద్దాలుకంటే అప్పలకొండే తల్లడిల్లిపోయేడు.

"పుడతార్లే మావా! అప్పుడే వయసయిపోయినట్లు దిగులు పడతావెందుకు ?" అని పద్దాలే ఒకటిరెండుసార్లు భర్తను ఓదార్చింది.

"వయసయి పోయింతర్వాత పుడితే, వాళ్ళ ముద్దుముచ్చటలు మనం చూడొద్దటే వెర్రిమొద్దూ ?" అనేవాడుకొండ.

తనకు ఆతృత లేకపోయినా, భర్త ముచ్చట తీర్చటానికి తాను త్వరలో తల్లి కావాలని ఎన్నో మొక్కులు మొక్కుకుంది.

బెజవాడ కనకదుర్గమ్మను కొలుసుకుంటే, తలచుకున్నది జరుగుతుందని ఎవరో చెబితే, అప్పలకొండ భార్యతో కలసివెళ్ళి ఆ మొక్కు తీర్చుకున్నాడు. ఆ తర్వాత పద్దాలు నీళ్ళోసుకుంది.

పుట్టిన మగబిడ్డకు దుర్గడని పేరెట్టుకున్నారు.

దుర్గణ్ణి వాళ్ళు మామూలుగా పెంచలేదు. రాజకుమారుడిలా పువ్వుల్లోపెట్టి పెంచుకున్నారు. వాడి నవ్వుల్లో ఆనందాన్ని పంచుకున్నారు.

నాలుగయిదుక్లాసులు చదివింతర్వాత—

'చదివింది చాలు కానీ, వాడ్నికూడా పన్లోకి పంపించు. నాలుగు రాళ్లు తెచ్చి నీకు సాయం చేస్తాడు' అని నాయుడుగారంటే అప్పలకొండ ఆశపడ్డాడు.

చదువుమాన్పించి దుర్గణ్ణి నాయుడిగారి పొలంలో పెట్టేడు.

పొలంలో పంట పెరిగింది...దుర్గడూ, పెరిగిపెద్దవాడయ్యేడు.. నూనూగుమీసాల నూతనందాలలో, చంద్రునిలా వెలిగిపోతున్నాడు.

వాడి ప్రయోజకత్వం చూసి మురిసిపోయిన మునసబుగారి కమతగాడు కనకయ్య. తన కూతురు మాలక్ష్మిని దుర్గడికి చేసుకొమ్మని అప్పలకొండ నడిగేడు.

ఆలస్యమయితే బంగారంలాంటి ఆ సంబంధాన్ని మరెవరయినా తన్నుకుపోతారనే తపనతో...

"తమరుకూడా కాస్తంత కలగచేసుకోవాలి !"—అని మునసబు గారికి మొరపెట్టుకున్నాడు కనకయ్య.

మునసబుగారు నాయుడిగారికి చెప్పేరు. నాయుడుగారు అప్పల కొండను ఒప్పించారు.

మాలక్ష్మికి దుర్గడికి పెళ్ళయింది...

అందమైన వయసూ.... తీర్చిదిద్దిన కళ్ళూ.... ఒద్దికయిన ఒంపు సొంపులతో మాలక్ష్మి అందరి కళ్ళకీ మహాలక్ష్మిలాగే కనిపించింది..., ఈడూ జోడూ చూడముచ్చటగా వున్నదని చూసిన వాళ్ళంతా మెచ్చు కున్నారు....

కానీ....

ఆ ముచ్చట మూడునెలలయినా తీరకుండానే-ఓ సాయంత్రం- తుఫాను ముంచుకొచ్చింది. ఉగ్రరూపంతో ఉప్పెన వెంట వచ్చింది. ఊరు ఊరంతా కకావికలమైపోయింది....కాస్తంత గట్టిగా వున్నమేడలూ డాబాలూ, రామాలయం, వేణుగోపాలస్వామి మందిరం తప్ప—తక్కిన ఇళ్ళన్నీ నేలమట్టమయ్యేయి....

మర్నాడు ఏమీ ఎరగనట్టు సూర్యుడు తూర్పుకొండల్లోంచిపైకొచ్చే వేళకి వూరంతా శవాలు !.... ఏడుపులూ.... కేకలూ.... పెడబొబ్బలూ....

నాయుడుగారి పొలం పొలిమేరల్లో దుర్గడూ, అప్పలకొండ మృతదేహాలు కనిపించేయి. చచ్చిపోయేదాకా-ఆ పొలంకోసం కలసి పనిచేసేరు.... చనిపోయేటప్పుడు కూడా కలిసే వుండాలనుకున్నారు కాబోలు-ఒకరినొకరు కౌగలించుకొని వున్నారు-నిర్జీవంగా !

పోయినవాళ్ళకోసం ఎందరివో ఏడ్పులు.... !

నాయుడుగారి మేడలో తలదాచుకున్న మాలక్ష్మి, పద్దాలూ తాము బతికి బయటపడినందుకు ఘొల్లుమన్నారు.

రోజులు గడిచేయి....

ఊరు నెమ్మదిగా చైతన్యాన్ని చేరదీసుకుంది.

పడిపోయిన గుడిశెను మళ్ళీ నిలబెట్టుకున్నారు మాలక్ష్మి పద్దాలు.

వాళ్ళిద్దర్నీ తన యింట్లోనే పనిచేయమన్నారు నాయుడుగారు. తాము బ్రతికి బట్టకట్టడంలో ఏదో పరమార్థం వుందేమోననే గుండెరాయి చేసుకున్నారు వాళ్ళిద్దరూ.

మొండిగా బ్రతికేయటం అలవాటుచేసుకున్నారు. బీటలువారిన వాళ్ళ మనసుల్ని గడిచేకాలం కప్పేస్తూంటే....

ఓ రోజు-

గేదెలకు కుడితి కలుపుతున్న మాలక్ష్మిదగ్గరకొచ్చేడు, నాయుడి గారి ముద్దులకొడుకు నాగరాజు...

"ఓ ముద్దిచ్చి తన మురిపెం తీరిస్తే మురుగులు చేయిస్తా"నన్నాడు. పెళ్ళాంలా చూసుకుంటానన్నాడు.

"పెళ్ళాంలా చూసుకుంటే సరిపోదు పెళ్ళిచేసుకుంటావా ?" అడిగింది మాలక్ష్మి.

"మా నాన్న ఒప్పుకోడు ! అయినా నీకు లోటుచెయ్యన్లే !" అంటూ ఆమె చెయ్యి పట్టుకోబోయాడు.

చెంబులోని కుడితి నాగరాజు ముఖానికి కొట్టి వెళ్ళిపోయింది మాలక్ష్మి.

అదంతా చాటునుంచి పద్దాలు గమనించింది.

ఆ రాత్రి చాటుగా కన్నీళ్ళు పెట్టుకుంది.

నిజమే!

తాను ముప్పయ్యేళ్ళు మొగుడితో కాపురం చేసింది మొగుడి కౌగిట్లో దొరికే సుఖానికి విలువేమిటో తనకు బాగా తెలుసు.

కానీ, తన కొడుకుని కట్టుకుని మాలక్ష్మి ఏం సుఖపడింది?...

పోనీ...మాలక్ష్మి మళ్ళీ పెళ్ళిచేసుకుంటే?...అయితే, ఒక సారి పెళ్ళయిన తర్వాత మళ్ళీ ఎవరు చేసుకుంటారు?

"కావాలంటే నాయుడిగారి కొడుకులా 'ఉంచుకుంటా' మంటారు. అలా అయినా మాలక్ష్మి సుఖపడచ్చు...కానీ మాలక్ష్మి అలాంటిది కాదు...మరి ఇక జీవితాంతం అలాగే కోరికలకు దూరంగా వుండి పోగలదా?

ఇలా ఎన్నో పిచ్చి ఆలోచనలు పద్దాల్ని పట్టిపీడించేయి ఆరాత్రి.

ఆ తర్వాత పదిరోజులకి ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి.

రేడియోలో గంటగంటకీ తుఫాను హెచ్చరికలు వచ్చేయి.

"రెండేళ్ళయినా కాలేదు! మళ్ళీ ఇంతలోనే మరో తుఫానా? అందరూ అరచేతుల్లో ప్రాణాలు నిలుపుకున్నారు.

ముందే సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు.

కొందరు నాయుడుగారింటికి...మరికొందరు వేణుగోపాలస్వామి మందిరానికి, ఇంకొందరు స్కూలుబిల్డింగులోకి !

"మనమూ పోదాం, రా అత్తా ! మాలక్ష్మి తొందరపెట్టింది.

పద్దాలు కదల్లేదు...

మళ్ళీ తుఫానొస్తుంది...మళ్ళీ ఉప్పెనొస్తోంది... ఈసారి తాను దాటిపోవాలి...మరోలోకంలో వున్న తన భర్తనీ-కొడుకునీ చేరుకోవాలి. మాలక్ష్మి మాత్రం ఇంకా బ్రతకాలి...ఇమెకు వయసుంది...అంద ముంది...ఆ రెండింటినీ దాచుకుని-కోరికలకు దూరంగా ఎంతకాలం వుంటుంది ? ఏదో ఒకనాడు బలహీనతకు లొంగిపోతుంది.వ్యవస్థా, కట్టుబాట్లూ మనిషిని కట్టిపారేసినా మనసు వాటిని త్రెంచుకొనేరోజు ఎప్పుడో ఒకప్పుడు రాకపోదు. ఆ చెడ్డరోజున తాను వుండకూడదు. అంతే !

అందుకే...ఈ తుఫాను తన ప్రాణాల్ని తుడిచిపెట్టెయ్యాలి !..

అవీ, పద్దాలు ఊహల్లో వువ్వెత్తున చెలరేగే ఆలోచనలు.

చుట్టుపక్కలవాళ్ళొచ్చేరు.

వాళ్ళందరికీ చేతులెత్తి దణ్ణంపెట్టింది పద్దాలు.

"నేనెక్కడున్నా ఒక్కటే... నన్నొదిలెయ్యండి... మాలక్ష్మిని కాపాడండి !" జాలిగా ప్రార్థించింది.

తుఫానుగాలి మరింత ఉద్ధృతమైంది.

దూరంగా ఫెళఫెళమనే శబ్దాలు...ఇళ్ళు కూలిపోతున్నాయి... వృక్షాలు నేలకొరిగిపోతున్నాయి.

దేవుణ్ణి ప్రార్థించుకుంటూ - ఒకరిచేతిని మరొకరు పట్టుకుని - అందరూ దేవాలయంవైపు నడిచేరు....గత్యంతరంలేక మాలక్ష్మికూడా వాళ్ళతోపాటు కదిలింది.

అందరితో-రామాలయం క్రిక్కిరిసిపోయింది...

వాళ్ళ ప్రార్థనలతో ఆగుడి మారుమ్రోగిపోయింది...అయినా ఆ రాముడికి వాళ్ళమొర వినిపించలేదు.

గుడికి పక్కనే-తరతరాలుగా పెరిగిన రావిచెట్టు గాలిధాటికి ఆగలేక గుడిమీదకు ఒరిగిపోయింది.

గుడిలో సీతారాముల విగ్రహాలు చెక్కుచెదర్లేదు. గుడిగోడలు మాత్రం కూలిపోయాయి. ఆ గోడలక్రిందపడి ఎందరో నలిగిపోయారు. అందులో మాలక్ష్మికూడా!

పద్దాలుకి మాత్రం కోరుకున్న చావు రానేలేదు.

తెల్లవారింతర్వాత వాన వెలిసినప్పుడు-కాళ్ళల్లో సత్తువనంతా కూడదీసుకుని రామాలయం దాకా వెళ్ళింది. మాలక్ష్మికోసం ఆత్రంగా చూసింది. సీతారాములు విగ్రహాల ప్రక్కన శిథిలాల్లో చిక్కుకున్న మాలక్ష్మి కనిపించింది నిర్జీవంగా. సీతమ్మవారి పాదాలదగ్గరున్న పళ్ళెంలోని కుంకుమ మాలక్ష్మి నుదుటమీద అస్తవ్యస్తంగా ఒలికి-మెరుస్తోంది.

ఆ దృశ్యాన్ని చూసిన పద్దాలుకి ఏడుపు రాలేదు.

"మొగుడికోసం ముస్తాబై నువ్వెళ్ళిపోయేవా మాలక్ష్మి!"- అనుకుంది. అలా అనుకున్నప్పుడు. పిచ్చినవ్వొకటి ఆమె పెదాల మీద క్షణంపాటు మెదిలి మాయమైంది.

* * *

"మళ్ళీ తుఫాను వస్తుందా బాబూ ?"

ఆలోచిస్తున్న సోముల్ని మళ్ళీ అడిగింది పద్దాలు...ఈసారి తుఫానొచ్చినప్పుడైనా తాను దాటిపోవాలని ఆమె ఆశ !

"వద్దవ్వా ! ఇంక తుఫాను రావద్దు..రావాలని కోరుకోవద్దు !".. అని చెప్పాలనుకున్నాడు.... కానీ అతని గొంతు దుఃఖంతో నిండి పోయింది.

అంతలోనే అక్కడకు వచ్చాడు నాయుడు....

"సోములూ ! ఇక్కడే వున్నావేమిటి? అవతల అందరికీ భోజనాలు పెడుతున్నారు....పద....పద...." అంటూ పక్కనేవున్న పద్దాల్ని గుర్తుపట్టేడు.

"నువ్ కూడా రా పద్దాలూ !-" ఆప్యాయంగా వాళ్ళిద్దరి చేతులు పట్టుకుని ముందుకు నడిచేడు నాయుడు. దగ్గరుండి వాళ్ళిద్దరికీ అన్నం పెట్టించేడు.

"మీరు తినండిబాబూ ! చాలా ఎండెక్కిపోయింది !"

తనచేత్తో ముద్దతీసి నాయుడి నోటికి అందించేడు సోములు.

కానీ ఆ ముద్ద గొంతుదిగలేదు.

నాయుడి కళ్ళల్లో మెరుస్తున్న కన్నీటినిచూసి.

బువ్వ తినేటప్పుడు ఏడవకూడదని మాఅమ్మ చెప్పేది. ఏడవ కండి బాబూ" అన్నాడు సోములు....

"లేదురా ! నిన్నుచూస్తే నాగరాజు జ్ఞాపకం వచ్చేడు.... వాడు మిగిలి నేను పోయినా బాగుండేది !"—అంటూ కళ్ళు తుడుచుకుని మళ్ళీ అన్నాడు నాయుడు.

"ఒరే సోములూ ! రేపు మళ్ళీ తుఫానొచ్చినప్పుడు నేనుపోతే- నాకు తల కొరివి పెడతావురా ?"—

ఆ ప్రశ్న విని, అర్థంకానట్టు అయోమయంగా నాయుడివైపు చూసేడు సోములు.

---

❊ స్వాతి ఆగష్టు '1980'